విల్లుపురం కోర్టులో

స్పెషల్ డీజీపీ హాజరు

మహిళా ఐపీఎస్‌పై లైంగిక వేధింపుల కేసు

చెన్నై, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మహిళా ఐపీఎస్ అధికారిపై లైంగిక వేధింపులకు పాల్పడిన కేసులో స్పెషల్ డీజీపీ రాజేష్‌దాస్ విల్లుపురం కోర్టులో సోమవారం ఉదయం జరిగిన విచారణకు హాజరయ్యారు. అన్నాడీఎంకే ప్రభుత్వ హాయంలో అప్పటి ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి పర్యటన భద్రతా విధుల్లో పాల్గొన్న సమయంలో మహిళా ఐపీఎస్ అధికారిని బలవంతంగా తన కారులో ఎక్కించుకుని ఆమెపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు రాజేష్‌దాస్‌పై కేసు నమోదైంది. ఆ కేసుపై విల్లుపురం క్రైం మేజిస్ట్రేట్ కోర్టు విచారణ జరిపింది. స్పెషల్ డీజీపీ రాజేష్‌దాస్‌కు మూడేళ్ల జైలు శిక్ష, రూ.20,500 జరిమానా, ఆ మహిళా ఐపీఎస్ అధికారి కారు తాళాలను లాక్కున్న సంఘటనకు సంబంధించి అప్పటి చెంగల్పట్టు డీఎస్పీ కన్నన్‌కు రూ.500 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. ఆ తీర్పును సవాలు చేస్తూ రాజేష్‌దాస్ సహా ఇరువురూ విల్లుపురం డిస్ట్రిక్ట్ ప్రిన్సిపల్ కోర్టులో అప్పీలు చేసుకున్నారు. అదే సమయంలో రాజేష్‌దాస్ తరఫు న్యాయవాదులు ఈ కేసు విచారణను వేరే జిల్లాకు మార్చాలని దాఖలు చేసిన పిటిషన్‌ను మద్రాసు హైకోర్టు తోసిపుచ్చటంతోపాటు విల్లుపురం డిస్ట్రిక్ట్ ప్రిన్సిపల్ కోర్టు విచారణ జరిపి తీర్పు వెలువరించేందుకు ఎలాంటి అభ్యంతరాలు లేవని స్పష్టం చేసింది. జనవరి 24 లోగా విచారణను పూర్తి చేయాలని ఆదేశించింది. హైకోర్టు జారీ చేసిన ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ రాజేష్‌దాస్ సుప్రీంకోర్టును ఆశ్రయించినా ఫలితం లేకపోయింది. ఆ అప్పీలును సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. మద్రాసు హైకోర్టు ఉత్తర్వులను సమర్థించింది. ఈ పరిస్థితుల్లో విల్లుపురం కోర్టులో ఈ కేసు విచారణ ఈనెల 24న మళ్లీ ప్రారంభమైంది. ఈనెల 29 కేసు విచారణ వాయిదా పడింది. ఈ విచారణకు స్పెషల్ డీజీపీ రాజేష్‌దాస్ తప్పకుండా హాజరై తన వాదనలను వినిపించవచ్చునని విల్లుపురం కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మేరకు రాజేష్‌దాస్ విచారణకు హాజరయ్యారు. వాద ప్రతివాదనల తర్వాత కేసు తదుపరి విచారణ ఈ నెల 31కి వాయిదా పడింది.


విల్లుపురం కోర్టు విచారణకు వెళుతున్న స్పెషల్ డీజీపీ రాజేష్‌దాస్

చెన్నైలో ఖుష్బూ!

పాండీలో నిర్మలా సీతారామన్ పోటీ?





చెన్నై, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో ఎన్డీయే కూటమి తరఫున 25 మంది అభ్యర్థులను రంగంలోకి దింపాలని, వారిలో ప్రజలకు సుపరిచితులైన, వాగ్ధాటి కలిగిన మహిళామణులను పోటీకి దించాలని బీజేపీ అధిష్ఠానం నిర్ణయించింది. ఆ మేరకు బీజేపీలో జాతీయ స్థాయిలో కీలక పాత్ర పోషిస్తున్న ప్రముఖ సినీ నటి ఖుష్బూను దక్షిణ చెన్నై లోక్‌సభ నియోజకవర్గంలో, ఇక పుదుచ్చేరిలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను పోటీ చేయించేందుకు రంగం సిద్ధమైంది.

ఎన్నికల కార్యాలయాలు....

అభ్యర్థుల ఎంపిక కంటే ముందుగా రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ రాష్ట్ర శాఖ రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల కార్యాలయాలను ప్రారంభిస్తుండడం రాజకీయవర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. అన్ని పార్లమెంటు నియోజకవర్గాల్లో ఈ కార్యాలయాలు ఏర్పాటవుతున్నాయి. ఇటీవల తిరునల్వేలిలో ప్రారంభించారు. తాజాగా వేళచ్చేరి రామ్‌నగర్ ఆరవ మెయిన్‌రోడ్డులో పార్టీ కార్యాలయాన్ని ఆ పార్టీ శాసనసభ్యురాలు వానతి శ్రీనివాసన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కరు నాగరాజన్, కరాటే త్యాగరాజన్, భాస్కర్, కాళిదాస్, సాయి సత్యన్ తదితరులు పాల్గొన్నారు. ఈ ఎన్నికల కార్యాలయం దక్షిణ చెన్నై లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఉంది. ఈ నియోజకవర్గంలో పోటీ చేయడానికి అప్పుడే సీనియర్ నాయకులు అధిష్ఠానానికి దరఖాస్తు చేసుకున్నారు. ఆ ప్రకారం దక్షిణ చెన్నైలో పోటీకి కరు నాగరాజన్, తిరుపతి నారాయణ్, రమేష్‌శివా, ఎస్‌జీ సూర్యా ప్రయత్నాలు సాగిస్తున్నారు. అయితే అధిష్ఠానం ఆయా నియోజకవర్గాల్లో ప్రజలకు బాగా పరిచయమున్న వ్యక్తులను, ప్రత్యేకించి సినీ నటీనటులను, ప్రముఖులను పోటీకి దింపాలని నిర్ణయించింది. ఆ ప్రకారమే దక్షిణ చెన్నైలో నటి ఖుష్బూను పోటీ చేయించాలని భావిస్తోంది. ఈ విషయమై ఖుష్బూ మాట్లాడుతూ... లోక్‌సభ ఎన్నికల్లో తనను అభ్యర్థిగా ఎంపిక చేశారో లేదో తనకు తెలియదని చెప్పారు. ఈసారి రాష్ట్రం నుంచి ఎన్డీయే ఎంపీలు అధిక సంఖ్యలో గెలిపించడానికి కృషి చేస్తానన్నారు.

ఊహించని అభ్యర్థి...

నిర్మల్ కుమార్ సురానా ఇటీవల పార్టీ నిర్వాహకుల సమావేశంలో మాట్లాడుతూ... పుదుచ్చేరి నియోజకవర్గంలో ఎవరూ ఊహించని అభ్యర్థి పోటీ చేయనున్నారంటూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేరును పరోక్షంగా ప్రస్తావించారు. తమిళనాడుకు చెందిన నిర్మలా సీతారామన్ కూడా పుదుచ్చేరిలో పోటీ చేయడానికి సుముఖత వ్యక్తం చేశారని కూడా బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. ఇదిలా ఉండగా పుదుచ్చేరిలో పనిచేస్తున్న అటవీశాఖకు చెందిన సీనియర్ అధికారి కూడా బీజేపీ టిక్కెట్ కోసం ప్రయత్నిస్తున్న తెలుస్తోంది. ఏదీ ఏమైనప్పటికీ ఈ సారి పుదుచ్చేరిలో, చెన్నైలో మహిళా అభ్యర్థులు బరిలోకి దిగడం ఖాయమని పార్టీ నేతలు చెబుతున్నారు.

పుదుచ్చేరిలో...

పుదుచ్చేరి లోక్‌సభ నియోజకవర్గంలో ఎన్డీయే కూటమి తరఫున పోటీకి మహిళా ప్రముఖులు పలువురు ప్రయత్నాలు సాగిస్తున్నారని తెలుస్తోంది. పుదుచ్చేరి గవర్నర్‌గా ఉన్న తమిళిసై సౌందరరాజన్ ఈ సారి లోక్‌సభ ఎన్నికలల్లో పోటీ చేయడం ఖాయమని చెబుతున్నారు. ఆమెకు పార్టీ టికెట్ లభిస్తే పుదుచ్చేరినే ఎంపిక చేసుకుంటారని ప్రచారం జరుగుతోంది. అదే సమయంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేరూ పరిశీలనలో ఉన్నట్టు ఢిల్లీ నుంచి రాష్ట్ర కమిటీ నాయకులకు వర్తమానం అందింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘనవిజయానికి తీవ్రంగా పాటుపడిన ఎన్నికల ఇన్‌చార్జి నిర్మల్‌కుమార్ సురానా లోక్‌సభ ఎన్నికలకు కూడా ఇన్‌చార్జిగా నియమితులవడంతో పార్టీ శ్రేణులు హర్షం ప్రకటిస్తున్నారు.

డీఎంకేకు దీటుగా

మెగా కూటమి



పీఎంకే, డీఎండీకేలకు గాలం ● ఈపీఎస్ తాజా వ్యూహం

చెన్నై, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే సెక్యులర్ కూటమికి దీటుగా మెగా కూటమిని రూపొందించటానికి అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి సిద్ధమవుతున్నారు. వన్నియార్ల ఓటు బ్యాంక్ కలిగిన పాట్టాలి మక్కల్ కట్చి (పీఎంకే)ని, దివంగత సినీనటుడు విజయకాంత్ అభిమానులు మెండుగా ఉన్న దేశీయ ముర్పోక్కు ద్రావిడ కళగం (డీఎండీకే)ని కూటమిలో చేర్చుకునేందుకు పావులు కదుపుతున్నారు. ఇప్పటికే ఆ రెండు పార్టీల సీనియర్ నాయకులతో అన్నాడీఎంకే మాజీ మంత్రులు కొందరు మంతనాలు జరిపినట్లు చెబుతున్నారు. ఈ రెండు పార్టీల్లో డీఎండీకేని కూటమిలోకి రప్పించడం కాస్త కష్టమని ఈపీఎస్ భావిస్తున్నారు. ఆ పార్టీని తమ కూటమిలో చేర్చుకోవాలని అటు బీజేపీ, ఇటు అన్నాడీఎంకే ప్రయత్నిస్తున్నాయి. దీంతో ఏ పార్టీ వైపు మొగ్గుచూపాలో తెలియక డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత అయోమయంలో పడ్డారు. ప్రస్తుతం ఆమె లోక్‌సభ ఎన్నికల వైపు దృష్టిసారిస్తున్నారు.

కూటమిపై చర్చలు...

సోమవారం అన్నాడీఎంకే రాష్ట్ర ప్రధాన కార్యాలయమైన ఎంజీఆర్ మాళిగైలో జరిగిన పార్టీ నిర్వాహకుల సమావేశంలో డీఎండీకే, పీఎంకేని కూటమిలో చేర్చుకునే విషయంపై చర్చించినట్లు సమాచారం. అన్నాడీఎంకే డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కేపీ మునుసామి నాయకత్వంలో మాజీ మంత్రులు దిండుగల్ శ్రీనివాసన్, తంగమణి, వేలుమణి, బెంజమిన్ సభ్యులుగా కలిగిన కూటమి చర్చల కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీనియర్ నేతలంతా తొలుత డీఎండీకేని కూటమిలో చేర్చుకునేందుకు ప్రయత్నించాలని ప్రతిపాదించారు. బీజేపీకి ఉద్వాసన పలికిన తర్వాత అన్నాడీఎంకే కూటమిలో ప్రస్తుతం జీకే వాసన్ నాయకత్వంలోని టీఎంసీ, పురట్చి భారతం, ఎస్డీపీఐ, పెరుంతలైవర్ మక్కల్ కట్చి మాత్రమే మిత్రపక్షాలుగా ఉన్నాయి. ఈ మిత్రపక్షాలకు తలా ఒక సీటు ఇవ్వడం ఖాయం. అయితే ఈ చిన్న పార్టీల కంటే ప్రత్యేక ఓటు బ్యాంకున్న డీఎండీకే, పీఎంకేని కూటమిలో చేర్చుకుంటేనే డీఎంకేతో ఢీకొట్టేలా అన్నాడీఎంకే మెగాకూటమి మారగలదని ఈపీఎస్ భావిస్తున్నారు. ఉత్తరాది జిల్లాల్లో ఓటు బ్యాంక్ కలిగిన పీఎంకేని ఎలాగైనా కూటమిలో చేర్చాలని, సీనియర్ నాయకులు, మాజీ మంత్రులు ఇప్పటికే రాందాస్, అన్బుమణి రాందాస్‌తో రహస్య చర్చలు జరిపారు. డీఎంకే కూటమిలో పీఎంకేని చేర్చుకుంటే డీపీఐ వైదొలగటం ఖాయమని చెబుతున్నారు. కనుక డీఎంకే కూటమిలో పీఎంకేని చేర్చుకునేందుకు డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ సుముఖంగా లేరు. ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుని పీఎంకేని కూటమిలో చేరేలా రాందాస్‌ను ఒప్పించేందుకు అన్నాడీఎంకే మాజీ మంత్రులను రంగంలోకి దింపారు. ఇక డీఎండీకేని తమ కూటమిలో చేర్చుకోవాలని బీజేపీ కూడా తీవ్ర ప్రయత్నాలు సాగిస్తోంది. ఇటీవల ప్రధాని మోదీ తిరుచ్చి సభలో మాట్లాడుతూ దివంగత విజయకాంత్‌కు సంతాపం వ్యక్తం చేశారు. డీఎండీకేని ఎన్డీయేలో చేర్చుకోవడానికే మోదీ సభాముఖంగా సంతాపం ప్రకటించారని చెబుతున్నారు. కూటమిలో చేరితే డీఎండీకే ప్రముఖుడికి రాజ్యసభ సీటిస్తామంటూ బీజేపీ ఆశచూపుతోందని ప్రచారం జరుగుతోంది.

మాజీ మంత్రి పొన్ముడికి

సుప్రీంలో తాత్కాలిక ఊరట

లొంగుబాటుకు 4 వారాల అవకాశం



అడయార్, జనవరి 29: ఆదాయానికి మించి ఆస్తుల కేసులో మూడేళ్ల జైలు శిక్ష పడిన డీఎంకే సీనియర్ నేత, మాజీ మంత్రి డాక్టర్ కె.పొన్ముడి, ఆయన సతీమణి విశాలాక్షికి సుప్రీంకోర్టులో తాత్కాలిక ఊరట లభించింది. ఈ కేసులో శిక్ష పడిన ఈ ఇద్దరు జైలులో లొంగిపోయేందుకు హైకోర్టు విధించిన గడువును మరో నాలుగు వారాలపాటు పొడిగిస్తూ ఊరటను కల్పించింది. అదేసమయంలో ఈ కేసులో కౌంటర్ దాఖలు చేయాలని తమిళనాడు రాష్ట్ర అవినీతి నిరోధక శాఖను ఆదేశించింది. గత 2006-11 మధ్య రాష్ట్ర మంత్రిగా ఉన్న పొన్ముడి ఆదాయానికి మించి ఆస్తులు పోగు చేశారంటూ వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఏసీబీ ఆయనతో పాటు ఆయన భార్యపై కేసు నమోదు చేసింది. ఈ కేసు విచారణ విల్లుపురం జిల్లా కోర్టులో సాగింది. అయితే, సరైన సాక్ష్యాధారాలు లేవని పేర్కొంటూ కేసును కొట్టివేయడంతో ఏసీబీ హైకోర్టులో అప్పీల్ చేశారు. దీనిపై విచారణ జరిపిన న్యాయమూర్తి జి.జయచంద్రన్ ఈ అక్రమార్జన కేసులో పొన్ముడి దంపతులను విడుదల చేస్తూ కింది కోర్టు ఇచ్చిన తీర్పును కొట్టివేస్తూ, ఇద్దరికీ మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.50 వేల అపరాధం విధించింది. అపరాధం చెల్లించని పక్షంలో మరో 6 నెలలు జైలు శిక్ష అనుభవించాలని తీర్పునిచ్చారు. దీంతో మంత్రి పదవితో పాటు శాసనసభ సభ్యత్వాన్ని కోల్పోయారు. అయితే, ఈ కేసులో జైలులో లొంగిపోయే విషయంలో మినహాయింపు ఇవ్వాలని కోరుతూ పొన్ముడి దంపతుల తరపు న్యాయవాదులు సుప్రీంకోర్టులో మధ్యంతర పిటిషన్‌ను దాఖలు చేయగా, న్యాయమూర్తి అభయ్ ఎస్ యోహా సారథ్యంలోని ధర్మాసనం విచారించి, పొన్ముడి దంపతులు లొంగిపోయేందుకు నాలుగు వారాల సమయం ఇచ్చింది. అలాగే, ఈ కేసులో నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ఏసీబీని ఆదేశించింది.

అయోధ్య ప్రత్యక్ష ప్రసారం

వ్యవహారం

- రాష్ట్ర ప్రభుత్వాన్ని హిందూ వ్యతిరేకిగా చిత్రీకరించే యత్నం
- సుప్రీంకోర్టుకు తెలిపిన డీజీపీ

పెరంబూర్, జనవరి 29: రాష్ట్రాన్ని హిందూ వ్యతిరేకిగా చిత్రీకరించే ప్రయత్నం తప్ప, అయోధ్య ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం కాకుండా ప్రభుత్వం అడ్డుకోలేదని రాష్ట్ర డీజీపీ సుప్రీంకోర్టుకు నివేదించారు. ఈ నెల 22న జరిగిన అయోధ్య రామాలయ ప్రాణ ప్రతిష్ఠను ప్రత్యక్ష ప్రసారం చేసేందుకు రాష్ట్రప్రభుత్వం అనుమతించలేదని పేర్కొంటూ బీజేపీకి చెందిన వినోద్ పి.సెల్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ఆ రోజే విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం, ప్రత్యక్ష ప్రసారం కోరుతూ దరఖాస్తు చేసుకుంటే నిరాకరించరాదని మౌఖిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో, ఈ కేసు విచారణ సోమవారం న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం జరిపింది. ఆ సమయంలో, రాష్ట్ర డీజీపీ శంకర్ జివాల్ తరఫున దాఖలు చేసిన బదులు పిటిషన్‌లో... ప్రాణ ప్రతిష్ఠ వేడుక ప్రత్యక్ష ప్రసారం, ఆలయ వేడుక, భజనలు, అన్నదానం, ఊరేగింపు, పూజలు తదితరాలన్నింటికీ పోలీసు శాఖ, అధికారులు ఎలాంటి అభ్యంతరం తెలపలేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇండోర్, అవుట్ డోర్‌లు కలిపి 252 చోట్ల ప్రత్యక్ష ప్రసారాలు జరిగాయని తెలిపారు. ప్రాణ ప్రతిష్ఠ, పూజలు, ఊరేగింపు, భజనలు, అన్నదానం తదితరాలను ప్రత్యక్ష ప్రసారాలు చేయరాదని ముఖ్యమంత్రి మౌఖిక ఉత్తర్వులు చేశారనే ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. హిందూ వ్యతిరేకిగా రాష్ట్రప్రభుత్వాన్ని చిత్రీకరించే యత్నంలో భాగమే ఈ చర్యలున్నాయని తెలిపారు. అయోధ్య రామాలయం ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అర్చనలు జరిగాయని డీజీపీ వివరించారు.

అళగప్పా వర్శిటీలో కలాం విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న గవర్నర్



అమరవీరులను, పేదలను

అవమానించారు

గవర్నర్ ఆవేదన

చెన్నై, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కొన్ని పార్టీల నేతలు అమరవీరులు, పేదల జీవితాలు పట్టించుకోకుండా అవమానించారని గవర్నర్ ఆర్‌ఎన్ రవి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన తన 'ఎక్స్'లో వ్యాఖ్యలు చేశారు. తాను నాగపట్టినం జిల్లా కీళవెన్మణి గ్రామంలో ఆదివారం పర్యటించి, 1968లో జరిగిన అమానుషకాండ బాధితుడు జి.పళనివేలును పరామర్శించినట్లు వివరించారు. అలాగే నంబియార్ నగర్‌లోని జాలర్లు, జీవా నగర్‌లో దళిత కుటుంబాలను పరామర్శించానని, అక్కడి వారి పేదరికం తనను కలచివేసిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల జీవన విధానం మెరుగుపడలేదని, వారికి గృహవసతి కల్పించేలా 'పీఎం ఆవాస్ యోజన' పథకం నిర్వహణలో లోపాలు, అవినీతి తదితరాలు ఆవేదనకు గురిచేస్తున్నాయన్నారు. పేదల అభ్యున్నతే తన లక్ష్యమని పేర్కొంటున్న ఓ రాజకీయ పార్టీ.. కీళవెన్మణిలోని పేదల గుడిసెల మధ్యలో, దారుణ హత్యకు గురైన 44 మంది కూలీ కార్మికుల స్మారకార్థం భారీ వ్యయంతో ఎత్తైన కాంక్రీట్ స్థూపం ఏర్పాటు చేయడం వాస్తవానికి విరుద్ధంగా ఉందన్నారు. అమరజీవులు, పేదలను వారు అవమానిస్తున్నారని గవర్నర్ వ్యాఖ్యానించారు.

గవర్నర్‌కు 'మీడియా మోనియా వ్యాధి': న్యాయశాఖ మంత్రి రఘుపతి ఆగ్రహం

గవర్నర్ రవి వ్యాఖ్యలపై రాష్ట్ర న్యాయశాఖ మంత్రి రఘుపతి స్పందించారు. ఆయన 'మీడియా మోనియా వ్యాధి'తో బాధపడుతున్నారని ఎద్దేవా చేశారు. తమిళనాడు గవర్నర్ రవి, పుదుచ్చేరి గవర్నర్ తమిళిసై, కేరళ గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్ తదితరుల మధ్య మీడియాలో ఎవరి పేరు ఎక్కువగా రావాలి అనే పోటీ నెలకొందన్నారు. రాష్ట్రప్రభుత్వాన్ని విమర్శించడం ద్వారా ప్రతిరోజూ పత్రికల్లో పతాక శీర్షికలో రావచ్చని రాష్ట్ర గవర్నర్ భావిస్తున్నారని విమర్శించారు. ఆయన గవర్నర్‌లా వ్యవహరించడం లేదని, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా వ్యవహరిస్తారని విమర్శించారు. నాగపట్టినం వెళ్లిన గవర్నర్, ప్రధాని గృహ యోజనలో నిర్మించిన గృహాలు సరిగా లేవని నోటికొచ్చినట్లు విమర్శలు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఈ పథకంలో ఏవైనా లోపాలుంటే రాష్ట్రప్రభుత్వాన్ని సంప్రదించాలే కానీ మీడియాలో విమర్శించడం భావ్యమేనా అని నిలదీశారు. రాష్ట్రప్రజల కోర్కెలు తీర్చేందుకు గవర్నర్ ఒక్కసారైనా ఢిల్లీ వెళ్లారా? రాష్ట్రప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి ఏరోజైనా సహకరించారా అని ప్రశ్నించారు. కీళవెన్మణి అమరవీరుల స్థూపాన్ని గవర్నర్ కించపరిచారని, అయోధ్య ఇప్పుడు ఎలా ఉందో గవర్నర్ ఒక్కసారి చూసి వస్తే బావుంటుందని ఎద్దేవా చేశారు.

అన్ని వసతులూ కల్పిస్తాం.. పెట్టుబడులతో రండి

స్పెయిన్ పారిశ్రామికవేత్తలకు స్టాలిన్ పిలుపు


స్పెయిన్ రాజధాని మాడ్రిడ్ నగరంలో భారత రాయబారి దినేష్ కే పట్నాయక్‌తో సీఎం స్టాలిన్, మంత్రి టీఆర్‌బీ రాజా

చెన్నై, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తమిళనాట కొత్త పరిశ్రమలు నెలకొల్పేందుకు పెట్టుబడులతో రావాలని స్పెయిన్ పారిశ్రామికవేత్తలకు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పిలుపునిచ్చారు. స్పెయిన్ రాజధాని మాడ్రిడ్‌లో సోమవారం నిర్వహించిన అంతర్జాతీయ పెట్టుబడిదారుల సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. తమ రాష్ట్రంలో దేశవిదేశాలకు చెందిన బహుళ జాతి సంస్థలు పరిశ్రమలు స్థాపించి ఉత్పత్తులను పెంచి లాభాల బాటలో పయనిస్తున్నాయంటూ ఆ కంపెనీల జాబితా వివరాలను ప్రకటించారు. పరిశ్రమలు స్థాపించేందుకు అవసరమైన స్థలాలు, నీరు, విద్యుత్ తదితర కీలకమైన సదుపాయాలను కల్పిస్తున్నామని, కంపెనీల లైసెన్స్ జారీని కూడా ఏకగవాక్ష (సింగిల్ విండో) పద్ధతిలో మంజూరు చేస్తున్నామని తెలిపారు. ఇక దరఖాస్తు సమర్పించిన రెండు వారాల్లోగా ప్రభుత్వం తమ నిర్ణయాన్ని ప్రకటిస్తుందన్నారు. ఈ సదస్సులో స్పెయిన్‌కు చెందిన కొన్ని కంపెనీల ప్రతినిధులు రాష్ట్రప్రభుత్వంతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకునేందుకు అంగీకరించాయని స్టాలిన్‌తో పాటు వెళ్లిన పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్‌బీ రాజా ప్రకటించారు. అంతకు ముందు స్పెయిన్ రాజధాని మాడ్రిడ్ నగరానికి చేరుకున్న ముఖ్యమంత్రి స్టాలిన్, ఆయన సతీమణి దుర్గాస్టాలిన్, మంత్రులు, అధికారులకు అక్కడి భారత రాయబారి దినేష్ పట్నాయక్ ఇతర అధికారులు ఘనస్వాగతం పలికారు. ఈ సదస్సు ముగిసిన తర్వాత రోహా, గెస్టరామ్ వంటి బహుళజాతి కంపెనీల ప్రతినిధులతో స్టాలిన్ భేటీ అయ్యారు. ఇన్వెస్ట్‌స్పెయిన్ అనే పెట్టుబడుల సంస్థ ప్రతినిధులు కూడా ముఖ్యమంత్రిని కలుసుకున్నారు. రాష్ట్రంలో తమ పరిశ్రమల స్థాపనకు గల అవకాశాలు సదుపాయాలు గురించి అడిగి తెలుసుకున్నారు.



ఇదిలా ఉండగా ముఖ్యమంత్రి స్టాలిన్ స్పెయిన్ రాజధాని మాడ్రిడ్ నగరానికి విమానంలో ప్రయాణిస్తున్నప్పుడు అంతర్జాతీయ టెన్నిస్ క్రీడాకారుడు నోవాక్ జోకోవిచ్‌ను కలుసుకున్నారు. ఇరువురూ సెల్ఫీలూ తీసుకుంటూ కాసేపు సందడి చేశారు.

సమాచార దర్శిని

38 మంది అర్బన్ ప్లానర్ల నియామకం

ఐసిఎఫ్, జనవరి 29: రాష్ట్రంలో నగరాల విస్తరణకు నిర్మాణ ప్రణాళికలు రూపొందించేందుకు 38 మంది అర్బన్ ప్లానర్లను నియమించినట్లు సీఎండీఏ తెలిపింది. దేశవ్యాప్తంగా నగరాల అభివృద్ధి పనులు చేపట్టేందుకు కేంద్రప్రభుత్వం నిధులు అందజేస్తోంది. రూ.1,300 కోట్లు నిధులు పొందేందుకు సీఎండీఏ నిర్ణయించింది. దీని ద్వారా నగరాల పరిధిని విస్తరింపజేసి అభివృద్ధి పనులు చేపట్టనుంది. ఇందుకోసం నియమితులైన 38 మందిలో సీఎండీఏకు 13 మంది, డీటీటీసీకి 20 మంది, పర్యావరణ, భౌగోళిక వంటి ఐదు విభాగాలకు తలా ఒక్కొక్కరు వంతున కేటాయించారు.

210 మెగావాట్ల విద్యుదుత్పత్తి నిలిపివేత

ఐసిఎఫ్, జనవరి 29: తిరువళ్లూర్ జిల్లా అత్తిపట్టులో ఉన్న ఉత్తర చెన్నై థర్మల్ విద్యుత్ కేంద్రంలో 210 మెగావాట్ల విద్యుదుత్పత్తికి అంతరాయం ఏర్పడింది. ఇక్కడ తలా 210 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మూడు యూనిట్లు పనిచేస్తున్నాయి. రెండో యూనిట్‌లో బాయిలర్ ట్యూబ్ పంక్చర్ కారణంగా శనివారం రాత్రి నుంచి ఉత్పత్తి నిలిచిందని అధికారులు తెలిపారు.

ఓవర్‌లోడ్ ప్రాంతాల్లో అదనపు సాధనాలు

ఐసిఎఫ్, జనవరి 29: ఓవర్‌లోడ్ ఉన్న ప్రాంతాల్లో అదనంగా సాధనాలు ఏర్పాటు చేయాలని ఇంజనీర్లకు రాష్ట్ర విద్యుత్‌బోర్డు ఉత్తర్వులు జారీచేసింది. కేబుల్, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, పిల్లర్ బాక్స్ వంటి ద్వారా విద్యుత్‌ను సరఫరా చేస్తున్నారు. అన్ని విద్యుత్ సాధనాల్లో పూర్తి సామర్థ్యంతో విద్యుత్ ప్రవహిస్తోంది. కొన్ని సమయాల్లో ఓవర్‌లోడ్ కారణంగా మరమ్మతులకు గురవుతున్నాయి. 2022-23లో వివిధ సామర్థ్యాలు కలిగిన 10,693 ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురయ్యాయి. మార్చి నుంచి వేసవి ప్రారంభం కానుండడంతో ఇలాంటి సమస్యలు తలెత్తకుండా విద్యుత్ బోర్డు చర్యలకు ఉపక్రమించింది. ఓవర్‌లోడ్‌ప్రాంతాలు గుర్తించి అదనంగా పిల్లర్‌బాక్స్‌లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి.

అన్ని జిల్లాల్లో మహిళా హాస్టళ్లు

ఐసిఎఫ్, జనవరి 29: రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో మహిళా సంక్షేమగృహాలు ప్రారంభించనున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి గీతాజీవన్ తెలిపారు. తూత్తుకుడి జిల్లా కోవిల్‌పట్టిలో 'తాళికి బంగారం' కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి విలేకరులతో మాట్లాడుతూ... పుదుమై పెన్ పథకంలో ఆర్థికసాయం 6వ తరగతి నుంచి ప్లస్ టూ వరకు చదివిన విద్యార్థులకు నెలకు రూ.1,000 అందిస్తున్నామని, దీని ద్వారా 2.11 లక్షల మంది లబ్ధి పొందుతున్నారని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో చదువు మధ్యలో ఆపేసిన 11,962 విద్యార్థులు మళ్లీ విద్యనభ్యసిస్తున్నారన్నారు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న మహిళల కోసం 13 జిల్లాల్లో హాస్టళ్లు ఉన్నాయని, త్వరలో అన్ని జిల్లాల్లో వీటిని ప్రారంభించనున్నామని చెప్పారు.

2.20 కోట్ల గృహాలకు పైప్‌లైన్ ద్వారా గ్యాస్ సరఫరా

ఐసిఎఫ్, జనవరి 29: రాష్ట్రంలో 2030లోపు 2.20 కోట్ల గృహాలకు పైప్ లైన్ ద్వారా గ్యాస్ సరఫరా చేయనున్నట్లు పెట్రోలియం, సహజ వాయువు క్రమబద్ధీకరణబోర్డు అధ్యక్షుడు అనీల్‌కుమార్‌జైన్ తెలిపారు.నగరంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ... ప్రపంచ వ్యాప్తంగా సహజ వాయువు వినియోగం 25 శాతం ఉండగా, దేశంలో 6 శాతం ఉందన్నారు. ఈ శాతం పెంచేందుకు కేంద్రప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. రాష్ట్రంలో 17 వేల గృహాలకు పైప్‌లైన్ ద్వారా గ్యాస్ సరఫరా చేస్తున్నామని, 2030లోపు ఈ సంఖ్య 2.20 కోట్ల గృహాలుగా పెంచనున్నామని తెలిపారు.

ఉన్నత విద్యా సంస్థలకు అంగీకార విధానాల్లో మార్పులు

ఐసిఎఫ్, జనవరి 29: వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఉన్నత విద్యాసంస్థలకు అంగీకారం ఇచ్చే విధానాల్లో కొత్త మార్పులు అమల్లోకి వస్తాయని యూజీసీ ప్రకటించింది. 2020లో రూపొందించిన కొత్త విద్యా విధానం దేశవ్యాప్తంగా అమల్లో ఉందని, ఉన్నత విద్యార్థుల అడ్మిషన్లను 2037లోపు 50 శాతం పెంచేలా లక్ష్యం నిర్ణయించినట్లు తెలిపింది. అంతర్జాతీయ స్థాయి విద్యాసంస్థలతో పోటీ చేసే స్థాయికి భారత విద్యాసంస్థల నాణ్యత పెంచేలా కొత్త విధానాలు రూపొందించినట్లు పేర్కొంది. ఇందుకోసం ఉన్నత విద్యాసంస్థల అంగీకారం, ర్యాంకుల వరుసలో మార్పులు తీసుకురావడంపై ఇస్రో మాజీ అధ్యక్షుడు రాధాకృష్ణన్ నేతృత్వంలో నిపుణుల కమిటీ ఏర్పాటైందని, ఈ కమిటీ సూచనల కొత్త మార్పులు చోటుచేసుకోనున్నాయని తెలిపింది. ఈ విధానం వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమల్లోకి వస్తుందని పేర్కొంది.

2.47 లక్షల మంది ఎగ్జిబిషన్ సందర్శన

ఐసిఎఫ్, జనవరి 29: స్థానిక ఐలాండ్ గ్రౌండ్స్‌లో ఏర్పాటుచేసిన 48వ పర్యాటక, వస్తు ప్రదర్శనను 2.47 లక్షల మంది సందర్శించినట్లు పర్యాటక శాఖ అధికారులు తెలిపారు. ఈ ఎగ్జిబిషన్‌లో వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన 49 స్టాళ్లు, కేంద్ర ప్రభుత్వ సంస్థలకు చెందిన 2 స్టాళ్లు సహా 3డీ థియేటర్, పిల్లలకు వినోదాన్ని పంచే వివిధ ఏర్పాట్లు చేపట్టారు. ప్రదర్శన ప్రారంభించిన 14 రోజుల్లో 2,47,769 మంది సందర్శించారని, ఆదివారం ఒకే రోజు 50వేల మందికి పైగా వచ్చారని పర్యాటక శాఖ అధికారులు తెలిపారు.

ఎమ్మార్టీఎస్ స్టేషన్ల అభివృద్ధికి టెండర్లు

ఐసిఎఫ్, జనవరి 29: ఎమ్మార్టీఎస్ స్టేషన్ల అభివృద్ధికి త్వరలో టెండర్లు ఆహ్వానించనున్నట్టు అధికారులు తెలిపారు. నగరంలో సబర్బన్ రైళ్లు, మెట్రో రైళ్లు, ఎమ్మార్టీఎస్ రైళ్లు అని మూడు రకాల రైలు సేవలు అందుబాటులో ఉన్నాయి. ఎమ్మార్టీఎస్ రైలు సేవలను సెయింట్ థామస్ మౌంట్ వరకు పొడిగించేందుకు స్టేషన్, లైన్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అదే సమయంలో ఈ స్టేషన్లలో మౌలిక సదుపాయాలు లేవని ప్రయాణికులు విమర్శిస్తున్నారు. దీంతో స్టేషన్లను అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టిన రైల్వే శాఖ, టెండర్లు ఆహ్వానించనుంది.

నేడు పీఎంకే సమావేశం

పెరంబూర్, జనవరి 29: విల్లుపురం జిల్లా తైలాపురం గార్డెన్‌లో మంగళవారం పీఎంకే సమావేశం జరగనుంది. పార్టీ వ్యవస్థాపకులు రాందాస్ నేతృత్వంలో, అధ్యక్షుడు అన్బుమణి రాందాస్ సహా ముఖ్య నేతలు సమావేశంలో పాల్గొననున్నారు. పార్లమెంటు ఎన్నికల్లో కూటమిలో కొనసాగింపు, సీట్ల సర్దుబాటు తదితరాలపై చర్చించనున్నట్లు ఆ పార్టీ ఒక ప్రకటనలో తెలియజేసింది.

15లోపు రోడ్ల నిర్మాణ టెండర్లు ఆహ్వానం

పెరంబూర్, జనవరి 29: చెన్నై సహా శివారు ప్రాంతాల్లో చేపట్టనున్న రోడ్ల నిర్మాణ పనులకు సంబంధించిన టెండర్లు ఫిబ్రవరి 15వ తేదీలోపు ఆహ్వానించనున్నట్టు పురపాలక శాఖ ఆదేశాలు జారీ చేసింది. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్‌లో రూ.250 కోట్లు, మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ విభాగంలో రూ.228 కోట్లు, మున్సిపాలిటీ డైరెక్టరేట్ తరఫున రూ.38 కోట్లు అని మొత్తం రూ.500 కోట్ల పనులను పురపాలన శాఖ అనుమతులు జారీ చేసింది. ఈ పనులకు సంబంధించిన టెండర్లు వచ్చే నెల 15వ తేదీ లోపు ఆహ్వానించాలని పేర్కొంది.

వామ్మో... గూగుల్ మ్యాప్!

మెట్లపై చిక్కుకున్న కారు



పెరంబూర్, జనవరి 29: గూగుల్ మాప్ చూపిన మార్గంలో వెళ్లిన కారు మెట్లపై చిక్కుకుంది. నీలగిరి జిల్లా ఊటీకి పొరుగు రాష్ట్రాలు, విదేశాల నుంచి పర్యాటకులు పెద్దసంఖ్యలో వస్తుంటారు. వరుస సెలవుల నేపథ్యంలో మూడు రోజులు ఊటీ వచ్చే పర్యాటకుల సంఖ్య పెరిగింది. ఈ నేపథ్యంలో, కర్ణాటకకు చెందిన కొందరు యువకులు కారులో ఊటీకి వచ్చారు. పర్యాటక ప్రాంతాలను సందర్శించిన వారు ఆదివారం సాయంత్రం గూడలూరు నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. రోడ్డు మార్గం తెలియని వారు గూగుల్ మ్యాప్ ఆధారంగా వాహనం నడుపుతున్నారు. మ్యాప్‌లో చూపిన మార్గంలో వెళ్లిన కారు మెట్లపై చిక్కుకుంది. దీంతో, స్థానికులు, ట్రాఫిక్ పోలీసులు రెండు గంటలు శ్రమించి మెట్లపై కంకర రాళ్లు పోసి కారును సురక్షితంగా కిందకు తీసుకొచ్చారు.

టూరిస్టు బస్సు ఢీకొని తల్లి, కుమార్తె మృతి

చెన్నై, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఉలుందూరుపేట ఆసనూరు వద్ద సోమవారం వేకువజాము





జయ, వసంతి (ఫైల్ ఫొటోలు)

సంభవించిన రోడ్డు ప్రమాదంలో తల్లి, కుమార్తె మృతి చెందారు. మరో 22మంది తీవ్రంగా గాయపడ్డారు. దిండుగల్ జిల్లా నత్తం తాలూకా ఉడువంబట్టి ప్రాంతానికిచెందిన ఇడియాప్పంవ్యాపారి అళగురాసు భార్య జయ (40) ఆ ప్రాంతంలో మహిళా స్వయం సహాయక సంఘం అధ్యక్షురాలిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో చెన్నైలో మహిళా స్వయం సహాయక సంఘం ప్రధాన కార్యాలయంలో పనుల నిమిత్తం జయ, తన భర్త ఇద్దరు కుమార్తెలు వసంతి (18), వైదేహి (14)తో కలిసి ఆదివారంరాత్రి కారులో బయల్దేరారు. కారును అళగురాసు నడిపాడు. సోమవారం వేకువజాము 5 గంటల ప్రాంతంలో ఆ కారు ఉలుందూరుపేట ఆసనూరు సిడ్కో రహదారిలో వెళుతుండగా రామేశ్వరంనుంచి కాంచీపురానికి వేగంగా వెళ్తున్న టూరిస్టు బస్సు ఢీకొంది. దీనితో ఆ కారు ముందు వైపు వెళుతున్న లారీ వెనుక భాగాన్ని ఢీకొన్నది. ఈదుర్ఘటనలో జయ,ఆమె పెద్ద కుమార్తె వసంతి తీవ్రంగాగాయపడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. అళగురాసు, వైదేహి, బస్సులో ప్రయాణించిన 20 మంది గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదం కారణంగా తిరుచ్చి - చెన్నై జాతీయ రహదారిలో 2 గంటలపాటు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

మంత్రి సెంథిల్ బాలాజి రిమాండ్ పొడిగింపు

పెరంబూర్, జనవరి 29: మంత్రి సెంథిల్ బాలాజి రిమాండ్‌ను ఈనెల 31వ తేది వరకు పొడిగిస్తూ చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. చట్టవ్యతిరేక నగదు బట్వాడా చట్టం కింద గత ఏడాది జూన్ 14వ తేది మంత్రి సెంథిల్ బాలాజిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు అరెస్ట్ చేసి పుళల్ జైలుకు తరలించారు. ఆయనకు వ్యతిరేకంగా గత ఏడాది ఆగస్టు 12వ తేది చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టులో 3,000 పేజీల చార్జిషీటు, దస్తావేజులను ఈడీ దాఖలు చేసింది. ఈ కేసులో బెయిల్ తోసిపుచ్చిన నేపథ్యంలో, పుళల్ జైలులో ఉన్న మంత్రి సెంథిల్ బాలాజి రిమాండ్ ఈ నెల 29వ తేది సోమవారంతో ముగియనుండడంతో, చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎస్.అల్లి ఎదుట వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన్ను హాజరపరిచారు. దీంతో, రిమాండ్‌ను ఈనెల 31వ తేదివరకు పొడిగిస్తూ న్యాయమూర్తి అల్లి ఉత్తర్వులు జారీచేశారు. దీంతో 17వసారి రిమాండ్ పొడిగించినట్లైంది.

12కు వేంగైవాయల్ కేసు విచారణ వాయిదా

పెరంబూర్, జనవరి 29: వేంగైవాయల్‌లో 10 మందికి లై డిటెక్ట్ పరీక్షలు జరపాలన్న సీబీసీఐడీ పిటిషన్‌పై విచారణ ఫిబ్రవరి 12వ తేదీకి వాయిదాపడింది. పుదుకోట జిల్లా వేంగైవాయల్ దళితుల కాలనీలో ఉన్న పై ఓవర్ ట్యాంక్‌లో మాన వ్యర్థాలు కలిసిన వ్యవహారంపై సీబీసీఐడీ పోలీసులు విచారణ చేపట్టారు. ఈ కేసులో ఇప్పటికే 31 మందికి డీఎన్‌ఏ పరీక్షలు నిర్వహించగా, తదుపరి చర్యల్లో భాగంగా 10 మందికి లై డిటెక్టర్ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించారు. అందుకోసం జిల్లా ఎస్సీ, ఎస్టీ అంటరానితనం నిర్మూలన చట్టం ప్రత్యేక న్యాయస్థానంలో సీబీసీఐడీ పిటిషన్ దాఖలుచేసింది. ఈ పిటిషన్ సోమవారం విచారణకు రాగా, తదుపరి విచారణ ఫిబ్రవరి 12వ తేదీకి వాయిదావేస్తూ న్యాయమూర్తి ఎస్.జయంతి ఉత్తర్వులు జారీచేశారు.

జల్లికట్టు ఎద్దు పొడిచి ఒకరి మృతి

పెరంబూర్, జనవరి 29: తంజావూరులో జరిగిన జల్లికట్టు పోటీల్లో ఎద్దు పొడవడంతో గాయపడి చికిత్సలు పొందుతున్న వ్యక్తి మృతిచెందాడు. తిరుక్కనూరుపట్టిలో సెయింట్ ఆంతోనియార్ ఆలయపొంగల్ వేడుకల్లో భాగంగా ఆదివారం జల్లికట్టు పోటీలు నిర్వహించారు. పుదుకోట జిల్లా గంధర్వకోట సమీపం మంజపేట గ్రామానికి చెందిన వి.పవున్‌రాజ్ (49) ఓ ఎద్దు యజమానికి సహాయకుడిగా పాల్గొన్న సమయంలో, మరో ఎద్దు పొడిచి తీవ్రగాయాలతో తంజావూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ, సోమవారం తెల్లవారుజామున మృతిచెందాడు.

గంజాయి తరలించిన వ్యక్తికి 12 ఏళ్ల జైలు

పెరంబూర్, జనవరి 29: ఆంధ్ర నుంచి సరుకు వాహనంలో 392 కిలోల గంజాయి తరలిస్తున్న కేసులో, తేని జిల్లాకు చెందిన వ్యక్తికి 12 ఏళ్ల జైలు విధిస్తూ ప్రత్యేక న్యాయస్థానం తీర్పు వెలువరించింది. ఆంధ్ర రాష్ట్రం నుంచి గంజాయి తరలిస్తున్నట్లు అందిన సమాచారంతో, 2018 సెప్టెంబరు 23న జాతీయ మాదకద్రవ్యాల నిరోధక ప్రత్యేకఇంటెలిజెన్స్ విభాగ పోలీసులు తిరువళ్లూర్ జిల్లా కారనోడై చెక్‌పోస్ట్‌లో నిఘా వేశారు. ఆసమయంలో అటుగా వచ్చిన సరుకుల లోడుతో వచ్చిన లారీని పరిశీలించగా, అందులో 185 బండిళ్లలో 392.9కిలోల గంజాయిను గుర్తించి స్వాధీనం చేసుకొని, తేని జిల్లా కంభంకు చెందిన సెల్లదురై (45)ను అరెస్ట్ చేశారు. మాదకద్రవ్యాల నిరోధక కేసులు విచారిస్తున్న ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి జె.జూలియట్ పుష్ప వెలువరించిన తీర్పులో... సెల్లదురుపై మోపిన నేరారోపణలను సందేహాలు లేకుండా ప్రభుత్వం నిరూపించిందని పేర్కొంటూ, నిందితుడికి 12 ఏళ్ల జైలుశిక్షతో పాటు రూ.1.20 లక్షల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

కేకేఎస్ఎస్ఆర్ కేసులో హైకోర్టు సీజే ముందస్తు అనుమతి ఉందా?

కౌంటర్ దాఖలుకు సుప్రీంకోర్టు ఆదేశం

అడయార్, జనవరి 29: రాష్ట్ర మంత్రి కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్ కేసు విచారణకు మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి వద్ద ముందస్తు అనుమతి పొందారా? లేదా? అనే విషయంపై సోమవారం లోపు వివరణ ఇవ్వాలని హైకోర్టు రిజిస్ట్రార్‌కు సుప్రీంకోర్టు ఆదేశించింది. మంత్రి కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్, ఆయన భార్య ఆదిలక్ష్మి, స్నేహితుడు షణ్ముగమూర్తికి వ్యతిరేకంగా 2011లో విరుదునగర్ జిల్లా ఏసీబీ అధికారులు అవినీతి నిరోధక కేసును నమోదు చేశారు. ఈ కేసును విచారించిన శ్రీవిల్లిపుత్తూరులోని జిల్లా ప్రధాన మేజిస్ట్రేట్ కోర్టు విచారించి, కేసును కొట్టివేస్తూ, అందరినీ విడుదల చేసింది. అయితే, మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి ఆనంద్ వెంకటేష్ సుమోటోగా ముందుకు వచ్చి విచారణకు స్వీకరించారు. దీన్ని సవాల్ చేస్తూ రామచంద్రన్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కింది కోర్టు కొట్టివేసిన కేసును హైకోర్టు న్యాయమూర్తి ఆనంద్ వెంకటేష్ విచారించే అధికారం లేదు. పైగా ఆయన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నుంచి ముందస్తు అనుమతి పొందారా? లేదా? అన్నది తెలియదు. అందువల్ల ఈ కేసు విచారణను నిలిపివేస్తూ ఆదేశివ్వాలని పేర్కొన్నారు. దీనిపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి మిశ్రా సారథ్యంలోని ధర్మాసనం విచారణ జరిపి... ఈ కేసును స్వతహాగా విచారణ జరిపేందుకు జస్టిస్ ఆనంద్ వెంకటేస్ హైకోర్టు సీజే వద్ద ముందస్తు అనుమతి పొందారా? లేదా? అనే విషయాన్ని వచ్చే సోమవారం లోగా హైకోర్టు రిజిస్ట్రార్ తెలియజేయాలని ఆదేశించింది.

1008 మంది నృత్యకారులతో భరతనాట్య వేడుక

అడయార్, జనవరి 29: తంజావూరు జిల్లా కుంభకోణం సమీపంలోని కంభకరేశ్వరర్ ఆలయ కుంభాభిషేక వేడుకల్లో భాగంగా శనివారం సాయంత్రం 1008మంది నృత్యకారిణిల ఆధ్వర్యంలో భరతనాట్య కార్యక్రమం జరిగింది. ధర్మపురం ఆధీనానికి చెందిన ఈఆలయంలో వార్షిక మహా కుంభాభిషేకం వచ్చే నెల 2న జరగనుంది. ఇందులోభాగంగా, భరతనాట్య నృత్యోత్సవం జరిగింది. 1008 మంది నాట్యకళాకారిణిలు పాల్గొని భరతనాట్యం చేశారు. ఇది భక్తులను అమితంగా ఆకర్షించింది.

అనుమతి లేని ఆక్వాఫాంలను మూసివేయండి

మద్రాస్ హైకోర్టు ఆదేశం

అడయార్, జనవరి 29: రాష్ట్రంలో ప్రభుత్వం అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన ఆక్వాఫాంలను తక్షణం మూసివేసేలా చర్యలు తీసుకోవాలని మద్రాస్ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. నిర్ణీత గడువులోగా ఆక్వాఫాంలపై చర్యలు తీసుకోని అధికారులపై కూడా క్రమశిక్షణ చర్యలకు ఆదేశించింది. తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండి తాలూకాలో చట్ట వ్యతిరేకంగా అనేక ఆక్వాఫాంలున్నాయి. వీటిని తొలగించాలని దాఖలైన పిటిషన్‌ను విచారించిన హైకోర్టు వీటిని మూసివేయాలని కోరుతూ 2018లో తీర్పునిచ్చింది.ఈతీర్పునకు వ్యతిరేకంగా ఆక్వాఫాంయజమానులు అప్పీల్ చేయగా, తాజాగా న్యాయమూర్తి ఎస్ఎం.సుబ్రమణియం సమక్షంలో విచారణకు వచ్చింది. ప్రభుత్వంతరఫున హాజరైన అడ్వకేట్ వాదనలు వినిపిస్తూ, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కోస్టల్ ఫిషరీస్ డెవపల్‌మెంట్ కమిషన్ చట్టం మేరకు సముద్రతీర ప్రాంతానికి 2 కిలోమీటర్ల దూరంలో ఆక్వాఫాంలను నెలకొల్పాలని, అయితే ఈ జిల్లాలోని ఉన్న ఫాంలన్నీ ఈ నిబంధనకు లోబడే ఉన్నాయి. అయితే తగిన అనుమతులు లేకుండా వీటిని ఏర్పాటు చేశారు. అందుకే ఈ ఫాంలను మూసివేయాలని గతంలో తీర్పునిచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా 2,709 ఆక్వాఫాంలు ఉన్నాయి. వీటిలో 2,227 ఫాంలకు మాత్రమే గుర్తింపు ఉండగా, మరో 348 ఫాంలు రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకుని వున్నాయి. ఈ దరఖాస్తులు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి. కేవలం 134పౌల్ట్రీఫాంలకు మాత్రమే ఎలాంటి గుర్తింపు, అనుమతి లేకుండా ఉన్నాయని, వీటిపై చర్యలు తీసుకోవాలని జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశించిందని కోర్టుకు తెలిపారు. ఈ వాదనలు ఆలకించిన న్యాయమూర్తి.. గుర్తింపు లేని పౌల్ట్రీఫాంలను తక్షణం మూసివేయాలని, ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని, ఒకవేళ చర్యలు తీసుకోవడంలో అలసత్వం ప్రదర్శించే అధికారులపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కోయంబత్తూరులో తీవ్రవాద నిరోధక విభాగం

ఐసిఎఫ్, జనవరి 29: కోయంబత్తూరులో ప్రత్యేక తీవ్రవాద నిరోధక విభాగం ఏర్పాటు చేసి, దానికి ఎస్పీగా శశిమోహన్‌ను పోలీసు శాఖ నియమించింది. భారత తీవ్రవాద నిరోధక విభాగ కార్యాలయం కోయంబత్తూర్ గాంధీపురంలో ఉన్న సీబీసీఐడీ ప్రత్యేక ఇన్వెస్టిగేషన్ విభాగ కార్యాలయంలో పని చేస్తోంది. కోవైని కేంద్రంగా తిరుప్పూర్, నీలగిరి, ఈరోడ్, సేలం సహా పశ్చిమ మండలంలో ఉన్న 8 జిల్లాల్లో ఉగ్రవాదానికి సంబంధించి కేసులు విచారిస్తున్నారు. అలాగే, చట్టవ్యతిరేక చర్యల నిరోధక విభాగం, సాయుధ దళ చట్ట విభాగాల కింద నమోదయ్యే కేసులు కూడా పరిష్కరిస్తున్నారు. ఈ నేపథ్యంలో, కొత్తగా ప్రత్యేక తీవ్రవాద నిరోధక విభాగాన్ని పోలీసు శాఖ ఏర్పాటు చేసింది. ఎస్పీ శశిమోహన్ ఆధ్వర్యంలో డీఎస్పీ, ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు సహా 40 మంది పోలీసులు ఈ విభాగంలో పని చేయనున్నారు.

విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేత



విద్యార్థికి లాప్‌టాప్ అందజేస్తున్న అతిథులు, నిర్వాహకులు

పెరంబూర్, జనవరి 29: స్థానిక పొలిచ్చలూర్ అన్నదాన సాయి బాబా ఆలయ 9వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆరాధనల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. గ్రీన్ సిటీ అరిమా సంఘం ఆధ్వర్యంలో బి.కాం చదువుతున్న దివ్యాంగ విద్యార్థి ఆర్.విమల్‌కు ల్యాప్‌టాప్‌ను సంఘం అధ్యక్షుడు లయన్ పీఆర్ఎస్ శరవణరాజ్ అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ నటరాజన్, గ్రీన్ సిటీ అరిమా సంఘం ఆర్గనైజర్ లయన్ ఎస్.కన్నన్, లయన్ ఎం.అన్నామలై, లయన్ పాండ్యన్, పన్నీర్‌సెల్వం తదితరులు పాల్గొన్నారు.

మేడనుంచి జారిపడి పాల వ్యాపారి మృతి

ప్యారీస్, జనవరి 29: చెంగల్పట్టు జిల్లా గూడువాంజేరిలో మేడపై నుంచి జారిపడిన పాల వ్యాపారి మరణించిన సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పార్థసారథి (52) అనే పాల వ్యాపారి తన కుటుంబంతో గూడువాంజేరి రామదాస్ వీధిలో ఓ అద్దె ఇంట్లో నివసిస్తున్నారు. పెద్ద కుమార్తె ఐశ్వర్యకు వివాహం జరిపించిన ఆయన ఆ రోజు రాత్రి మిత్రులతో కలసి మద్యం తాగి ఇంటికెళ్లారు. పడక గదికి వెళ్లే మెట్లు ఎక్కే ప్రయత్నంలో కాలు జారి కిందపడిన పార్థసారథికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మరణించాడు. దీనిపై కుటుంబసభ్యుల సమాచారంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

భరతనాట్య కళాకారిణి ఇంట్లో నగల చోరీ

చేతివాటం చూపిన వృద్ధురాలి అరెస్ట్

ప్యారీస్, జనవరి 29: స్థానిక అరుంబాక్కంలోని భరతనాట్య కళాకారిణి ఇంట్లో పనిచేస్తూ 10 సవర్ల నగలు కాజేసిన వృద్ధురాలిని పోలీసులు అరెస్ట్ చేశారు. అరుంబాక్కం వీఓసీ వీధికి చెందిన వసంత అనే నాట్య కళాకారిణి ఇంట్లో పనిచేసేందుకు 15 రోజుల క్రితం అదే ప్రాంతానికి చెందిన శాంతి (68) అనే వృద్ధురాలు చేరారు. వారం రోజుల క్రితం బీరువాలో భద్రపరచిన 15 సవర్ల నగల్లో 10 సవర్ల నగలు కనిపించకపోవడంతో వసంత అరుంబాక్కం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదుచేసి పోలీసులు జరిపిన విచారణలో శాంతి ఈ చోరీకి పాల్పడినట్లు తెలియడంతో ఆదివారం ఆమె ఇంటికి వెళ్లి నగలు స్వాధీనం చేసుకొని ఆమెను అరెస్ట్ చేశారు.

వడ్డీ లేని రుణం పేరుతో మోసం

● బాధితుల ధర్నా

ప్యారీస్, జనవరి 29: వడ్డీ లేని రుణం పేరుతో కోట్లాది రూపాయలు మోసం చేసిన రూబీ రాయల్ జ్యువెలర్స్ కంపెనీ యాజమాన్యాన్ని అరెస్ట్ చేయాలని అశోక్‌నగర్‌లోని పోలీస్‌స్టేషన్ ముందు బాధితులు సోమవారం ధర్నా నిర్వహించారు. వెస్ట్ మాంబళంలో పదేళ్లుగా సయ్యద్ హిజ్బర్, ఆయన కుమారుడు రెహ్మాన్, అనిష్.. రూబీ రాయల్ జ్యువెలర్స్ అండ్ బ్యాంకర్స్ సంస్థ ప్రారంభించి, ఇస్లామీయ చట్ట ప్రకారం తాకట్టు పెట్టే నగలకు వడ్డీ లేకుండా రుణం ఇస్తామని ప్రకటించారు. ఇందుకు ముస్లింలు మాత్రమే అర్హులని తెలియజేయడంతో వందలాది ముస్లిం కుటుంబాలు ఆ ప్రకటన నమ్మి నగలు తాకట్టుపెట్టినట్లు తెలిసింది. ఈక్రమంలో, ఆ సంస్థ యజమానులు మద్రాసు హైకోర్టులో తమ సంస్థ దివాళా తీసిందంటూ 2019లో అఫిడవిట్ దాఖలు చేశారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఆ జ్యువెలరీ దుకాణాన్ని సీజ్ చేశారు. ఆ దుకాణంలో నగలు తాకట్టుపెట్టిన వారికి యాజమాన్యం మొండిచేయి చూపించడంతో 2019వ సంవత్సరం బాధితుల ఫిర్యాదులను అశోక్ నగర్‌లో ఉన్న ఆర్థిక నేర విభాగం పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా, ఈ మోసానికి పాల్పడిన నేరస్తులు బెయిలుపై విడుదలయ్యారు. వారిపై నాలుగేళ్లుగా పోలీసులు చార్జిషీటు దాఖలు చేయలేదని తెలిసింది. దీంతో సుమారు 100 మందికి పైగా ముస్లిం మహిళలు తమకు న్యాయం చేకూర్చాలంటూ అశోక్‌నగర్ పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించారు.

గంజా విక్రయించిన 36 మంది అరెస్టు

అడయార్, జనవరి 29: చెన్నైలో గత వారం రోజుల్లో వివిధ ప్రాంతాల్లో గంజాయి విక్రయించిన 36 మందిని నగర పోలీసులు అరెస్టు చేశారు. ఈనెల 21నుంచి 28వ తేదీ మధ్య నగర పోలీసులు వీరిని అరెస్టు చేశారు. వీరి నుంచి 67 కిలోల గంజాయి, 8 మొబైల్ ఫోన్లు, రూ.6.27లక్షల నగదు, ఆరు ద్విచక్ర వాహనాలు, మూడు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. నగర పోలీస్ కమిషనర్ సందీప్ రాయ్ రాథోడ్ ఆదేశం మేరకు... జనవరి 1నుంచి 27వ తేదీ వరకు గంజాయి కేసుల్లో పట్టుబడిన వారిలో 13 మందిని గూండా చట్టం కింద అరెస్టు చేశారు.

ఫిబ్రవరి 1న కావేరీ నదీ జలాల బోర్డు భేటీ

అడయార్, జనవరి 29: ఫిబ్రవరి 1న కావేరీ నదీ జలాల పంపిణీ నిర్వాహక మండలి సమావేశంకానుంది. ఈ మండలి ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశం కావాల్సి ఉంది. ఇందులోభాగంగ వచ్చే నెల 1న నిర్వహణ మండలి ఛైర్మన్ వినీత్ గుప్తా సారథ్యంలో వీడియో కాన్ఫరెన్స్‌లో సమావేశంకానుంది. ఇందులో తమిళనాడు, కర్ణాటక, పుదుచ్చేరి, కేరళ రాష్ట్రాలకు చెందిన సభ్యులు కూడా పాల్గొంటారు.

ప్రభుత్వ పాఠశాలల్లో స్వచ్ఛంద బోధనపై నిషేధం

ఐసిఎఫ్, జనవరి 29: ప్రభుత్వ పాఠశాలల్లో పర్మినెంట్, తాత్కాలిక ఉపాధ్యాయులు మినహా స్వచ్ఛందంగా పాఠాలు బోధించరాదని పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో 35 వేల ప్రభుత్వ పాఠశాలల్లో కోటి మందికి పైగా విద్యార్థులు చదువుతుండగా, 2.5 లక్షల శాశ్వత ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఈ విద్యా సంవత్సరం విద్యార్థుల సంఖ్య ప్రకారం వారి పాఠాలు బోధించేందుకు 13,000 ఉపాధ్యాయుల కొరత ఏర్పడింది. ఈ లోటును తీర్చేందుకు తాత్కాలిక ఉపాధ్యాయులను నియమించారు. కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 'ఇల్లం తేడి కల్వి' పథకంలో పనిచేసే స్వచ్ఛంద కార్యకర్తలను విద్యార్థులకు పాఠాలో బోధించేందుకు ప్రధానోపాధ్యాయులు ఉపయోగిస్తున్నట్లు పాఠశాల విద్యాశాఖకు ఫిర్యాదులందాయి. దీనిపై స్పందించిన విద్యాశాఖ, స్వచ్ఛంద కార్యకర్తలను తరగతులు నిర్వహించేందుకు వినియోగించరాదని ప్రధానోపాధ్యాయులకు ఉత్తర్వులు జారీచేసింది.

అభివృద్ధి పనుల పరిశీలన



పనుల వివరాలు తెలుసుకుంటున్న అసెంబ్లీ కమిటీ

వేలూరు, జనవరి 29: పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను అసెంబ్లీ కమిటీ పరిశీలించింది. కమిటీ అధ్యక్షుడు, కుంభకోణం ఎమ్మెల్యే అన్బయగన్ నేతృత్వంలోని బృందం తొరప్పాడిలో థాడ్కో ఆధ్వర్యంలో రూ.150 కోట్లతో నిర్మిస్తున్న ఆదిద్రావిడుల సంక్షేమ హాస్టల్ పనులను పరిశీలించారు. ఎమ్మెల్యేలు పరందామన్, సేవూరు రామచంద్రన్, శివకుమార్, నందకుమార్, కార్తికేయన్, జిల్లా రూరల్ పంచాయతీ కమిటీ అధ్యక్షుడు బాబు, శాసనసభ ప్రధాన సెక్రటరీ శ్రీనివాసన్, అదనపు సెక్రటరీ సుబ్రమణ్యం, జిల్లా రెవెన్యూ అధికారి మాలతి తదితరులున్నారు.

శ్రీ నారాయణ వైద్యుల సాధన



వైద్యబృందాన్ని అభినందిస్తున్న ఆసుపత్రి డైరెక్టర్ బాలాజి

వేలూరు, జనవరి 29: స్థానిక శ్రీ నారాయణి ఆసుపత్రిలో 46 ఏళ్ల జిప్సన్‌సాగర్ భుజం నొప్పి కారణంగా ఆర్థో శాఖలో చూపించుకున్నారు. అక్కడ ముట్టె మార్పిడి, ఆటల వైద్యవిభాగం ప్రధాన డాక్టర్ రెజిత్‌మాథ్యూస్, డాక్టర్ తిరుమలై, డాక్టర్ నెహ్రూతో కూడిన వైద్య బృందం ఆయనకు పరీక్షలు నిర్వహించి, బాధితుడికి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఈ విషయమై రెజిత్ మాథ్యూస్ మాట్లాడుతూ... ఈ శస్త్రచికిత్స క్లిష్టమైనదన్నారు. శస్త్రచికిత్స అనంతరం బాధితుడు ఆరోగ్యంగా ఉన్నాడని, ప్రస్తుతం ఫిజియోథెరపి చేయిస్తున్నామని తెలిపారు. శస్త్రచికిత్స విజయవంతంగా చేసిన వైద్యబృందాన్ని ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ బాలాజి అభినందించారు.

వినతిపత్రాల స్వీకరణ



వృద్ధురాలికి వినికిడి పరికరం అందిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, జనవరి 29: జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సుబ్బులక్ష్మి, సోమవారం తొలి గ్రీవెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేషన్ కార్డులు, ఇళ్ల పట్టాలు, వృద్ధుల పింఛన్ సహా పలు సమస్యలపై ప్రజలు అందజేసిన వినతి పత్రాలు స్వీకరించిన కలెక్టర్, సమస్యలు పరిశీలించి సత్వరం పరిశీలించాలని కలెక్టర్ సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో గ్రామీణాభివృద్ధి పథక డైరెక్టర్ ఆర్తి, మహిళా పథక డైరెక్టర్ నాగరాజన్, దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి శరవణన్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా వినికిడిలోపం కలిగిన దివ్యాంగుడికి కలెక్టర్ హియరింగ్ మెషిన్ అందజేశారు.

9న డీఎంకే-కాంగ్రెస్ సీట్ల సర్దుబాటుపై రెండో విడత చర్చలు

పెరంబూర్, జనవరి 29: లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే, కాంగ్రెస్ మధ్య సీట్ల సర్దుబాటుకు సంబంధించిన రెండో విడత చర్చలు చెన్నైలో ఫిబ్రవరి 9వ తేది జరగనున్నాయి. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రాజకీయ పార్టీల్లో ఎన్నికల వేడి ప్రారంభమైంది. రాష్ట్రంలో డీఎంకే కూటమిలో ఉన్న కాంగ్రెస్, పార్లమెంటు ఎన్నికల్లో కూటమిలో పోటీచేసే సీట్లకు సంబంధించి తొలివిడత చర్చలు ఈనెల 28న ఆదివారం స్థానిక తేనాంపేటలోని అన్నా అరివాయంలో జరిగిన విషయం విదితమే. ఈ చర్చలు సంతృప్తికరంగా కొనసాగిస్తున్నట్లు డీఎంకే, కాంగ్రెస్ ప్రకటించాయి. అదే సమయంలో కాంగ్రెస్ తరఫున తమిళనాడు, పుదుచ్చేరితో కలపి 12 స్థానాలు కేటాయించాలని కోరినట్లు వార్తలు వెలువడ్డాయి. ఈనెల 28న ఆదివారం జరిగిన తొలివిడత చర్చలు కొలిక్కి రాకపోవడంతో, రెండో విడత చర్చలు ఫిబ్రవరి 9వ తేది జరగనుట్లు సమాచారం.

4న ఎండీఎంకే, సీపీఎంతో...

కూటమిలో భాగస్వామ్య పార్టీగా ఉన్న ఎండీఎంకే, సీపీఎంలతో సీట్ల సర్దుబాటుపై ఫిబ్రవరి 4వ తేదీ డీఎంకే సీట్ల సర్దుబాటు కమిటీ సమావేశం కానుంది. ఎండీఎంకే ప్రిసీడియం చైర్మన్ ఎ.అర్జునరాజ్ నేతృత్వంలోని కమిటీతో ఫిబ్రవరి 4వ తేదీ, అనంతరం సీపీఎం కమిటీతో చర్చించనున్నారు. అంతకు ముందు సీపీఐతో 3వ తేది తేనాంపేట అన్నా అరివాలయంలో భేటీ కానున్నట్లు డీఎంకే తెలిపింది.

చెంబరంబాక్కంకు పూండి జలాలు

ఐసిఎఫ్, జనవరి 29: చెంబరంబాక్కం జలాశయానికి పూండి జలాలు విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈశాన్య రుతుపవన వర్షాలతో చెంబరంబాక్కం జలాశయంలో 21 అడుగులకు పైగా నీటినిల్వలు చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో, ఆంధ్ర-తమిళనాడు కృష్ణా నది జలాల పంపిణీ పథకం కింద కండలేరు డ్యాం నుంచి పూండి జలాశయానికి నీరు విడుదల కానుంది. పూండి జలాశయం నీటిమట్టం తగ్గించేలా, అక్కడి నుంచి చెంబరంబాక్కానికి ఈనెల 25వ తేది సెకనుకు 130 ఘనపుటడుగుల నీరు విడుదల చేశారు. చెంబరంబాక్కం నీటిమట్టం ఆదివారం గణాంకాల ప్రకారం 3,045 టీఎంసీలు (21.72 అడుగులు) పెరిగింది. నగర తాగునీటి అవసరాలకు 109 ఘనపుటడుగులు, సిప్కాట్ అవసరాలకు 3 ఘనపుటడుగులు, వ్యవసాయానికి 3 ఘనపుటడుగులు విడుదలవుతోంది.

హాంకాంగ్, మారిషస్‌కు త్వరలో విమాన సేవలు ప్రారంభం

ఐసిఎఫ్, జనవరి 29: కరోనా వ్యాప్తితో నిలిపివేసిన హాంకాంగ్, మారిషస్ విమాన సేవలు మళ్లీ ప్రారంభమయ్యాయి. 2020 మార్చిలో కరోనా వ్యాప్తితో చెన్నై విమానాశ్రయంలో సేవలు పూర్తిగా నిలిపివేశారు. కరోనా తగ్గుముఖం పట్టడంతో మళ్లీ సేవలు పునఃప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో, హాంకాంగ్ - చెన్నై మధ్య నడిచే పసిఫిక్ ఎయిర్‌లైన్స్ విమాన సంస్థ నాలుగేళ్ల అనంతరం తన సేవలను ఫిబ్రవరి మొదటి వారంలో ప్రారంభించనుంది. వారంలో మూడు రోజులు నడిపే ఈ సేవలను ప్రయాణికుల రాకను బట్టి దినసరి సేవలుగా మార్చనున్నట్లు సంస్థ తెలిపింది. అలాగే, చెన్నై నుంచి మారిషస్ దేశానికి ఎయిర్ మారిషస్ విమాన సేవలు ఏప్రిల్ నుంచి ప్రారంభం కానున్నాయని అధికారులు తెలిపారు.

10 మంది నాగపట్టినం జాలర్ల విడుదల

పెరంబూర్, జనవరి 29: నాగపట్టణం జాలర్లు 10 మందిని విడుదల చేస్తూ శ్రీలంక కోర్టు ఉత్తర్వులు జారీచేసింది. సరిహద్దులు దాటారని ఆరోపిస్తూ ఈ నెల 14వ తేది నాగపట్టణానికి చెందిన 10 మంది జాలర్లను శ్రీలంక నావికాదళం అరెస్ట్ చేసింది. ఈ నేపథ్యంలో, జాఫ్నా మత్స్యశాఖ సిఫారసుల మేరకు, 10 మంది జాలర్లను విడుదల చేస్తూ శ్రీలంక కోర్టు సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. అలాగే, జాలర్లు వినియోగించే పడవ పొందేందుకు దాని యజమాని స్వయంగా కోర్టుకు హాజరుకావాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

జిల్లా కలెక్టర్‌గా సుబ్బులక్ష్మి బాధ్యతల స్వీకరణ



కొత్త కలెక్టర్ సుబ్బులక్ష్మికి నియామక ఉత్తర్వులు అందిస్తున్న పాత కలెక్టర్ కుమరవేల్ పాండ్యన్

వేలూరు, జనవరి 29: స్థానిక కలెక్టర్ కార్యాలయంలో కొత్త కలెక్టర్‌గా సుబ్బులక్ష్మి సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆమెను పాత కలెక్టర్ కుమరవేల్ పాండ్యన్ పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. అలాగే, జిల్లా ఎస్పీ సహా పలు శాఖల ఉన్నతాధికారులు కొత్త కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



తిరువణ్ణామలై జిల్లా కలెక్టర్‌గా సోమవారం బాధ్యతలు స్వీకరిస్తున్న భాస్కర పాండ్యన్

'ఇరవినిల్ ఆట్టం పార్' ఆడియో ఆవిష్కరణ

ఆర్ఎస్‌వీ మూవీ మేకర్స్ బ్యానరుపై సేలం ఆర్ శేఖర్ నిర్మాణ సారథ్యంలో ఏ.తమిళ్‌సెల్వన్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'ఇరవినిల్ ఆట్టం పార్' చిత్ర ఆడియో, ట్రైలర్‌ను తాజాగా విడుదల చేశారు. చెన్నైలో జరిగిన ఈ ఆడియో ఆవిష్కరణ వేడుకకు ముఖ్య అతిథులుగా సీనియర్ దర్శకుడు పేరరసు, సీనియర్ నిర్మాత కె.రాజన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పేరరసు మాట్లాడుతూ... 'ఈ ట్రైలర్‌ను చూస్తుంటే యువత డ్రగ్స్‌కు బానిసలు కావడం, అందుకు కారణమైన వారిని పోలీసులు గుర్తించి పట్టుకుని, శిక్షించడం వంటి కోణంలో ఈ స్ర్కీన్‌ప్లే సాగేలా ఉంది. సాధారణంగా సినిమాల్లో పోలీస్ పాత్ర అంటే మొదట గుర్తుకు వచ్చేది దివంగత విజయకాంత్. అనేక మంది నటీనటులు పోలీస్ పాత్రల్లో నటిస్తారు. కానీ, పోలీస్ పాత్రలకు సరైన నటుడు కెప్టెన్ మాత్రమే. అందుకే ఈ చిత్ర బృందానికి కచ్చితంగా ఆయన ఆశీర్వాదం ఉంటుంది' అని అన్నారు. నిర్మాత కె.రాజన్ మాట్లాడుతూ... 'చిన్న సినిమా పెద్ద సినిమా అని అంటుంటారు. అది తప్పు. రూ.5 కోట్ల బడ్జెట్‌తో సినిమా తీస్తే అది రూ.50 కోట్లు వసూళ్లను రాబడితే అది పెద్ద సినిమా. రూ.100 కోట్లతో సినిమా తీసి రూ.50 కోట్ల నష్టం వస్తే అది పెద్ద సినిమా ఎలా అవుతుంది? చిన్న బడ్జెట్ సినిమా అయినప్పటికీ... కథకు ప్రాముఖ్యం ఇవ్వాలి. అలాంటి సినిమాలు విజయం సాధిస్తాయి. పెద్ద హీరోలు, బడా నిర్మాతల వల్ల ఇండస్ట్రీ మనుగడ సాగించడం లేదు. వీరు యేడాదికి కేవలం 30 నుంచి 35 సినిమాలు మాత్రమే తీస్తున్నారు. చిన్న నిర్మాతలు వందల సంఖ్యలో చిత్రాలు నిర్మిస్తున్నారు. చిన్న నిర్మాతలే వేలాది మంది సినీ నిర్మాణ కార్మికులకు యేడాది పొడవునా ఉపాధి కల్పిస్తున్నారు. అలాంటి నిర్మాతలను కాపాడుకోవాల్సిన బాధ్యత నటీనటులపై ఉంది' అని అన్నారు. ఆ తర్వాత చిత్రం యూనిట్ సభ్యులు ప్రసంగించారు.



ఆడియో రిలీజ్ దృశ్యం

శశికుమార్ 'ఎవిడెన్స్' పూర్తి

సీనియర్ నటుడు శశికుమార్, నవీన్‌చంద్ర నటించిన 'ఎవిడెన్స్' చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుంది. 'కావల్‌తురై ఉంగల్ నన్బన్' ఫేం రంజిత్ మణికంఠన్ దర్శకత్వం వహించారు. దర్శకుడు కస్తూరిరాజా, యోగిబాబు కీలక పాత్రలను పోషించారు. ఫైవ్‌స్టార్ క్రియేషన్స్ బ్యానరుపై నిర్మాత ఫైవ్‌స్టార్ కదిరేశన్ నిర్మాణంలో తెరకెక్కింది. రాన్ ఎతన్ యోహాన్ సంగీతం అందించారు. వైవిధ్య భరితమైన యాక్షన్ ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్ జోనర్‌లో రూపొందించారు. ఈ సినిమా షూటింగ్‌ను అతి తక్కువ రోజుల్లో పూర్తి చేయడం గమనార్హం. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ సభ్యులు కేక్ కట్టింగ్ సెలెబ్రేషన్ వేడుకలు జరుపుకోగా, ఇందులో శశికుమార్, కస్తూరిరాజా, నవీన్ చంద్ర, రంజిత్, నిర్మాత కదిరేశన్, మిగిలిన యూనిట్ సభ్యులు పాల్గొన్నారు. పోస్ట్ ప్రొడక్షన్ నిర్మాణ పనులు పూర్తి చేసుకుని త్వరలోనే విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు నిర్మాత కదిరేశన్ వెల్లడించారు.



కేక్ కట్టింగ్ వేడుకల్లో చిత్ర బృందం

చిత్రజ్యోతి

ఎళిల్‌కు ఆర్.బి.చౌదరి ఆశీస్సులు

దర్శకుడిగా తనకు తొలి అవకాశం ఇచ్చిన బడా నిర్మాత ఆర్.బి.చౌదరిని దర్శకుడు ఎస్.ఎళిల్ సోమవారం కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఎస్.ఎళిల్ దర్శకత్వంలో విజయ్ - సిమ్రాన్ జంటగా నటించిన 'తుల్లాద మనముం తుల్లుం' చిత్రం విడుదలై జనవరి 29వ తేదీకి పాతిక సంవత్సరాలు పూర్తి చేసుకుంది. సూపర్‌గుడ్ ఫిలిమ్స్ బ్యానరుపై నిర్మాత ఆర్‌బీ చౌదరి నిర్మించగా, సూపర్ డూపర్ హిట్ సాధించింది. ఈ సందర్భంగా ఆ చిత్ర నిర్మాత ఆర్బీ చౌదరిని దర్శకుడు కలుసుకుని పుష్పగుచ్ఛం, స్వీట్లు అందజేసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎళిల్ మాట్లాడుతూ, 'ఒక దర్శకుడిగా ఆర్‌బీ చౌదరి అవకాశం ఇవ్వడం వల్లే ఇండస్ట్రీలో 25 యేళ్లుగా కొనసాగుతున్నా. అదేవిధంగా హీరో విజయ్‌ను కలుసుకునేందుకు అపాయింట్మెంట్ కోరగా, ఆయన మరోక్షణం ఆలోచించకుండా రమ్మన్నారు. విజయ్‌ను కలిసిన సమయంలో గత చిత్రాలతో పాటు ఇపుడు నటిస్తున్న చిత్రాలను వివరించారు. చాలా రోజుల తర్వాత విజయ్ మనసు విప్పి మాట్లాడారు. అదేవిధంగా సిమ్రాన్ కూడా ఫోనులో అభినందనలు తెలిపారు' అని పేర్కొన్నారు.



నిర్మాత ఆర్‌బీ చౌదరి - దర్శకుడు ఎస్.ఎళిల్

'సంఘి' చెడు వార్త కాదు : రజనీకాంత్

తన తండ్రిని 'సంఘి' అని పిలవడం మనసుకు కష్టంగా ఉందని గతవారం జరిగిన 'లాల్ సలాం' ఆడియో రిలీజ్ వేడుకలో ఆ చిత్ర దర్శకురాలు, సూపర్ స్టార్ కుమార్తె ఐశ్వర్య రజనీకాంత్ చేసిన వ్యాఖ్యలపై రజనీకాంత్ శుక్రవారం స్పందించారు. ఆయన చెన్నై ఎయిర్‌పోర్టులో విలేకరులతో మాట్లాడుతూ... 'సంఘి' అనే పదం చెడ్డది కాదు. అలా అర్థం వచ్చేలా ఆమె చెప్పలేదు. 'తన తండ్రి ఆధ్యాత్మికవేత్త, ఆయన అన్ని మతాలను సమానంగా అభిమానిస్తారు' అనే కోణంలో ఐశ్వర్య చెప్పారు. 'లాల్‌సలాం' సినిమా పబ్లిసిటీ కోసం ఆమె 'సంఘి' అనే పదాన్ని ఉచ్చరించలేదు. ఈ సినిమా మతసామరస్యాన్ని తెలియచెబుతుంది. చాలా బాగా వచ్చింది' అని పేర్కొన్నారు. కాగా, ఈ చిత్రం ఆడియో రిలీజ్ వేడుకలో ఐశ్వర్య మాట్లాడుతూ, 'గత కొన్ని రోజులుగా తన తండ్రిని సంఘి అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఏదేని ఒక రాజకీయ పార్టీకి మద్దతు ఇచ్చే వారిని ఇలా పిలుస్తారని నా యూనిట్ సభ్యుల ద్వారా తెలుసుకున్నాను. ఆయన అలాంటి వ్యక్తి కాదు. ఓ ఆధ్యాత్మికవేత్త. అలాంటి వ్యక్తి అయితే, 'లాల్‌సలాం' చిత్రంలో అతిథి పాత్రను పోషించరు' అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు వైరల్ అయ్యాయి. సినిమా ప్రమోషన్ కోసమే ఐశ్వర్య ఈ తరహా కామెంట్స్ చేశారంటూ ఇండస్ట్రీలో చర్చ జరుగుతుండగా రజనీ పై విధంగా స్పందించారు.



రజనీకాంత్ - ఐశ్వర్య

రజనీ, కమల్, విజయ్ సహా
అందరి మద్దతు కోరతాం

● బీజేపీ ఎమ్మెల్యే వానతి శ్రీనివాసన్



చెన్నై, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో రజనీకాంత్, కమలహాసన్, విజయ్ సహా అందరి నటీనటుల మద్దతు కోరుతామని బీజేపీ ఎమ్మెల్యే, జాతీయ మోర్చా ప్రధాన కార్యదర్శి వానతి శ్రీనివాసన్ తెలిపారు. అందరి మద్దతు కోరడం తమ బాధ్యత అని, ఆదరిస్తారా? లేదా? అన్నది వారి ఇష్టమన్నారు. చెన్నైలో సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్ర బీజేపీ ఆధ్వర్యంలో ప్రతి పార్లమెంటు నియోజకవర్గంలో ఎన్నికల కార్యాలయాలు ప్రారంభిస్తున్నామన్నారు. ఎన్నికల పనులు సమన్వయ పరచుకొనేందుకు ఈ కార్యాలయాలు ప్రధానంగా ఉంటాయన్నారు. 'ఇండియా' కూటమిలో ప్రధాన పాత్ర పోషిస్తున్న నితీశ్‌కుమార్, ప్రస్తుతం ఎన్డీఏలో చేరారని, గత పదిరోజుల్లో ఈ కూటమి పార్టీల తీరు ఎలా ఉందో అందరికి తెలిసిన విషయమేనన్నారు. రాష్ట్రానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఏం చేశారో ఎన్నికల ప్రచారంలో ప్రజలకు తెలియజేస్తామన్నారు. కూటమి ఏర్పాటుకు సంబంధించి పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందని వానతి శ్రీనివాసన్ తెలిపారు.

గంగా ఆసత్రిలో
మెటల్ ఫ్రీ మోకాళ్ల మార్పిడి చికిత్స



డాక్టర్ ఎస్.రాజశేఖరన్

అడయార్, జనవరి 29: కోయంబత్తూరులోని గంగా ఆస్పత్రిలో మెటల్ ఫ్రీ ఆల్ సెరామిక్ టోటల్ ఫ్రీ నీ రీప్లేస్‌మెంట్ (మోకాళ్ల మార్పిడి) చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఈ ఆస్పత్రికి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.రాజశేఖరన్ సారథ్యంలోని నిపుణుల వైద్య బృందం ఈ బీపీకే-ఎస్ ఇంటిగ్రేషన్ సెరామిక్ నీ సిస్టమ్‌లో మెటల్ ఫ్రీ, ఆల్ సెరామిక్ మోకాళ్ల మార్పిడి ఆపరేషన్‌ను పూర్తి చేసింది. ఆర్థోపెడిక్ సర్జన్లు, ఇంజనీర్లు, మెటీరియల్ సైంటిస్టులు కలిసి ఈ విధానాన్ని రూపొందించారు. ఈ చికిత్సా విధానం వల్ల హైపోఅలెర్జినిక్, హై ఇమ్యునాలజికల్ టాలరెన్స్, టిష్యూ ఫ్రెండ్లీ వంటి అనేక ఉపయోగాలు ఉన్నాయని డాక్టర్ ఎస్.రాజశేఖరన్ తెలిపారు.

నేడు తిరువయ్యారులో
త్యాగరాజస్వామి ఆరాధనోత్సవం

శ్రీరామపాద భాగవతార్ సందేశం



చెన్నై, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక సంగీత త్రిమూర్తుల్లో ఒకరైన భాగవతోత్తముడు త్యాగరాజస్వామి 177వ ఆరాధనోత్సవం మంగళవారం తంజావూరు జిల్లా తిరువయ్యారులో వైభవోపేతంగా జరగనుంది. గత నాలుగు రోజులుగా కావేరి నది ఒడ్డున ఆయన బృందావనం వద్ద ఉదయం మొదలు అర్ధరాత్రి వరకు సంగీత కచేరీలు జరుగుతున్నాయి. చివరి రోజైన మంగళవారం పుష్య బహుళ పంచమి ఆయన సిద్ధి పొందిన దినం. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మేటి కర్ణాటక సంగీత విద్వాంసులు పంచరత్న కీర్తనల గోష్ఠిగానం చేయనున్నారు. ఈ సందర్భంగా చెన్నైకి చెందిన శ్రీరామపాద భాగవతార్ ఓ సందేశమిస్తూ... కర్ణాటక సంగీతంలో ఎన్నో తెలుగు సాహిత్య కీర్తనలను అందించిన వాగ్గేయకార శిరోమణి త్యాగయ్య తెలుగువారై ఉండడం గర్వకారణమన్నారు. తెలుగు బిడ్డలైన 'ఎందరో మహానుభావులు' తమిళనాట స్థిరపడి ప్రపంచానికి ఆరాధ్యులయ్యారని, వారిలో త్యాగరాజస్వామి అగ్రగణ్యులని, ఆ మహనీయుడి ఆధ్యాత్మిక శాస్త్రీయ సంగీతోపాసనతో పాటు ఎన్నో వేలమందికి భక్తి ప్రసాదించాడని కొనియాడారు. ఇందుకు సంగీత విద్వాంసులు, విదుషీలు... త్యాగరాజస్వామి చరణదాసులేనని అన్నారు. ఆ మహనీయుల వారసత్వాన్ని పొంది భక్తి సంగీతంలో వేల సంఖ్యలో భావితరాల సంతతిని తీర్చిదిద్దాలని ఆయన పిలుపునిచ్చారు.



అయోధ్య శ్రీరామ విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ వేడుకల్లో భాగంగా చెన్నై డీజీపీ వైష్ణవ కళాశాలలో సీతారామ లక్ష్మణ ఆంజనేయ వేషధారణలో అలరిస్తున్న విద్యార్థులు





భక్తజనసముద్రంలో ఊరేగుతున్న వెట్రివేలాయుధస్వామి రథం

వైభవంగా వెట్రివేలాయుధస్వామి రథోత్సవం

చెన్నై, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూరు జిల్లా ఊత్తుకుళి కత్తిమలై వెట్రివేలాయుధస్వామి ఆలయ తైపూస రథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఆ ఆలయంలో ఈనెల 18 తైపూస ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాల్లో కీలక ఘట్టమైన రథోత్సవం సోమవారం ఉదయం జరిగింది. వేకువజామునే కత్తిమలై ఆండవర్‌కు మహా అభిషేకం, మహా దీపారాధన, స్వామివారి రథారోహణం వరుసగా జరిగాయి. అటు పిమ్మట ఉదయం 10 గంటలకు వేలాదిమంది భక్తజనం నడుమ స్వామివారి రథోత్సవం ప్రారంభమైంది. ఆలయ నిర్వాహకులు, నగర ప్రముఖులతోపాటు సామాన్య భక్తులు కూడా ఇరువైపులా నిలిచి రథం మోకుతాళ్లను పట్టుకుని లాగారు. ఆలయ వీధుల్లో ఊరేగిన తర్వాత ఆ రథం మండపానికి చేరింది. ఇదే విధంగా ఆలయంలో రాత్రి వళ్లీదేవసేన సమేతుడై సుబ్రహ్మణ్యస్వామి పుష్పపల్లకీలో ఊరేగి భక్తులకు కనువిందు చేశారు. మంగళవారం ఉదయం తైపూస వేడుకలు ప్రత్యేక తిరుమంజనంతో ముగియనున్నాయి.

కిళంబాక్కం నుంచే దక్షిణ జిల్లాలకు బస్సులు

మంత్రి శివశంకర్

ప్యారీస్, జనవరి 29: తిరుచ్చి, మదురై తదితర దక్షిణ జిల్లాలకు నడుపుతున్న ప్రభుత్వ ఎక్స్‌ప్రెస్ బస్సులు మంగళవారం నుంచి కోయంబేడుకు బదులుగా కిళంబాక్కం నుంచే బయల్దేరుతాయని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ఎస్ఎస్ శివశంకర్ స్పష్టం చేశారు. సచివాలయంలో మంత్రి శివశంకర్ సోమవారం మీడియాతో మాట్లాడుతూ... తిరుచ్చి, మదురై, తిరునల్వేలి, తూత్తుకుడి, నాగర్‌కోయిల్ తదితర దక్షిణ జిల్లాలకు, అలాగే చెంగల్పట్టు, దిండివనం, విల్లుపురంల మీదుగా వెళ్లే 710 ప్రభుత్వ బస్సులు ఇక నుంచి కిళంబాక్కం నుంచే బయల్దేరుతాయని తెలిపారు. మరో 160 బస్సులు మాధవరం బస్ టెర్మినల్ నుంచి నడిపేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మాధవరం నుంచి సేలం, విల్లుపురం, కళ్లకుర్చి, కుంభకోణం, పోలూరు, తిరుచ్చి, తిరువణ్ణామలై, విరుదాచలం, కడలూరు బన్రూట్టి తదితర ఉత్తర జిల్లాలకు, పుదుచ్చేరి రాష్ట్రానికి రూట్లను బట్టి నడుపనున్నట్లు తెలిపారు. దక్షిణ జిల్లాలకు ప్రభుత్వ బస్సుల్లో ప్రయాణం చేయదలచిన వారు ఇక నుంచి కోయంబేడుకు వెళ్లాల్సిన అవసరం లేదని, కోయంబేడు నుంచి కిళంబాక్కానికి ప్రతి 10 నిమిషాలకు ఒక బస్సు అందుబాటులో వుంటుందన్నారు. కోయంబేడు నుంచి ఈస్ట్ కోస్ట్ రోడ్డు మీదుగా వెళ్లే బస్సులు, పూందమల్లి మీదుగా వేలూరు, హోసూరు, ఆంబూరు, తిరుపత్తూర్ ప్రాంతాలకు నడిపే బస్సులు షెడ్యూల్ ప్రకారమే బయల్దేరుతాయని తెలిపారు. ఈనెల 24వ తేది నుంచి ప్రైవేటు రవాణా సంస్థలు నడుపుతున్న ఆమ్నీ బస్సులు కూడా కిళంబాక్కం నుంచే కొనసాగుతున్నాయని, ఇందులో ఎలాంటి మార్పులకు చోటులేదని మంత్రి స్పష్టం చేశారు.

కోయంబేడులో ప్రయాణికుల తరలింపు

ఆరు ఆమ్నీ బస్సుల స్వాధీనం

చెన్నై, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కోయంబేడులో ప్రయాణికులను తరలించిన ఆరు ఆమ్నీ బస్సులను ప్రాంతీయ రవాణా శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆమ్నీ బస్సులన్నీ కిళంబాక్కం నుండే నడపాలని ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది. అయితే కొంతమంది ఆమ్నీ బస్సుల యజమానులు ఆ ఉత్తర్వులను పట్టించుకోకుండా నగరంలోని కీలక ప్రాంతాల్లోనూ, కోయంబేడు మార్కెట్ రోడ్డులోను బస్సులను నిలిపి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. ఈ విషయం తెలియడంతో పూందమల్లి ప్రాంతీయ రవాణా శాఖ అధికారులు ఆదివారం రాత్రి నుంచి సోమవారం వేకువజాము వరకు తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించి కోయంబేడులో ప్రయాణికులను ఎక్కించుకుని వెళుతున్న ఆరు ఆమ్నీ బస్సులను స్వాధీనం చేసుకున్నారు.



చెన్నైలో జరిగిన గణతంత్ర దినోత్సవాల్లో ద్వితీయబహుమతి గెలుచుకున్న పోలీసు శకటాన్ని ఎగ్మూరు పోలీసు మ్యూజియంలో ఆసక్తిగా తిలకిస్తున్న పాఠశాల విద్యార్థులు

రియల్ ఎస్టేట్ రంగ అభివృద్ధి కోసం సహకారం

● మంత్రుల హామీ



కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు, ప్రముఖులు

అడయార్, జనవరి 29: రాష్ట్రంలో భవన నిర్మాణ రంగ అభివృద్ధి కోసం ప్రభుత్వ పరంగా అన్ని రకాల సహాయ సహకారాలను అందిస్తామని రాష్ట్ర గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఎస్.ముత్తుస్వామి, రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్ బాబు హామీ ఇచ్చారు. క్రెడాయ్ తమిళనాడు విభాగం ఆధ్వర్యంలో దక్షిణ భారతదేశంలో అతిపెద్దదిగా భావించే 'రియల్ ఎస్టేట్ కాంక్లేవ్ - స్టేట్‌కాన్ 2024'ను సోమవారం వారు ప్రారంభించారు. ఇందులో క్రెడాయ్ రూపొందించిన తమిళనాడు రియల్ ఎస్టేట్ అవుట్‌లుక్ రిపోర్టును విడుదల చేశారు. ఇందులో మంత్రి శేఖర్‌బాబు మాట్లాడుతూ.. సింగిల్ విండో విధానంలో 2021-23 మధ్య కాలంలో 605 అనుమతులు మంజూరు చేశామన్నారు. అలాగే, లే అవుట్లకు అనుమతులు కూడా 197 నుంచి 305కు పెరిగాయని వెల్లడించారు. అంటే రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వడంలో 300 శాతం వృద్ధి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో క్రెడాయ్ తమిళనాడు ప్రెసిడెంట్ ఆర్.ఇళంగోవన్, క్రెడాయ్, సౌత్ జోన్ వైస్ ప్రెసిడెంట్ శ్రీధరన్, భారతీయ స్టేట్ బ్యాంకు జనరల్ మేనేజర్ ఎంవీఆర్ మురళికృష్ణ, క్రెడాయ్ తమిళనాడు కార్యదర్శి ఎస్.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

భరతనాట్యంలో 'నోబుల్' సాధన



తాంబూలం పళ్లేలపై భరత నాట్యంలో విద్యార్థులు

పెరంబూర్, జనవరి 29: ప్రపంచ రికార్డు కోసం 161 విద్యార్థినులు తాంబూలం పళ్లేలపై నిలబడి విరామం లేకుండా 40 నిమిషాలు భరత నాట్యాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమం రామనాథపురం జయ్ నటనాలయ భరతనాట్య శిక్షణ పాఠశాల ఆధ్వర్యంలో వేలుమనోహరన్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రాంగణం జరిగింది. ఒకే సమయంలో 161 విద్యార్థులు తాంబూలం పళ్లేలపై నిలబడి భరతనాట్యం చేశారు. వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు 40 నిమిషాల్లో 11 పాటలకు భరత నాట్యం చేశారు. దీన్ని నోబుల్ వరల్డ్ రికార్డ్స్ సంస్థ ప్రపంచ రికార్డుగా నమోదు చేసింది. ప్రపంచంలోనే తొలిసారిగి ఇలాంటి సాధన చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

పొత్తేరిలో రైల్ కోచ్ రెస్టారెంట్



రైలు బోగీ ఆకారంలో నిర్మించిన రెస్టారెంట్

చెన్నై, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా పొత్తేరిలో ప్రైవేటు భాగస్వామ్యంతో దక్షిణ రైల్వే సంస్థకు చెందిన రైలు బోగీని తలపించేలా నిర్మించిన రైల్వే కోచ్ రెస్టారెంట్ పదిరోజుల్లో ప్రారంభం కానుంది. పొత్తేరి జీఎస్టీ రోడ్డు మీదుగా నగరం వైపు రోజూ బస్సులు, కార్లు, తదితర వాహనాల్లో వేలసంఖ్యలో ప్రయాణికులు వస్తుంటారు. అలా ప్రయాణించేవారికి ఈ రైల్వేకోచ్ రెస్టారెంట్ రుచికరమైన వంటకాలను వడ్డిస్తుందని రైల్వే అధికారులు తెలిపారు. రూ.1.5 కోట్లతో, 2 వేల చదరపుటడుగుల విస్తీర్ణంలో నిర్మించిన ఈ రెస్టారెంట్‌కు 'ఎన్.హెచ్ 32' అని పేరుపెట్టారు. ఈ రెస్టారెంట్‌లో భోజనం చేస్తే రైలు బోగీలో భోజనం చేసిన అనుభూతి కలుగుతుందని అధికారులు తెలిపారు. భారతీయ వంటకాలు, చైనీస్, ఇటాలియన్ వంటకాలతో పాటు పిజ్జా, బర్గర్, నూడుల్స్, మాంసాహార భోజనాలు కూడా లభిస్తాయని పేర్కొన్నారు. ఈ రెస్టారెంట్‌లో భోజనం చేసేందుకు కొయ్య కుర్చీలు, గ్రానైట్ బల్లలు, సోఫాలు కూడా ఏర్పాటు చేశారు. ఆంధ్రా, తమిళనాడు పాకశాల ప్రవీణులు ఈ రెస్టారెంట్‌లో రుచికరమైన వంటకాలతో భోజన ప్రియులను ఆకట్టుకోవడం ఖాయమని రైల్వే అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

చెన్నైలో నమ్మ యాత్రీ ఆటోలు

● కొత్త యాప్ ఆవిష్కరణ



నమ్మ యాత్రీ గ్రూపులో సభ్యత్వం పొందిన ఆటో డ్రైవర్లతో రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ ఎ. షణ్ముగసుందరం, కుమ్టా స్పెషల్ ఆఫీసర్ ఐ జయకుమార్, నాస్కామ్ హెడ్ భాస్కర్ వర్మ తదితరులు

చెన్నై, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరం చెన్నైలో 'నమ్మ యాత్రీ' పేరుతో ఆటో సర్వీసులను ప్రారంభించేందుకు రంగం సిద్ధమైంది. అన్నా విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థులు విమల్‌కుమార్, టీ.కోషీ ఈ నమ్మ యాత్రీ యాప్‌ను రూపొందించారు. ప్రయాణికులకు, ఆటో డ్రైవర్‌లకు జీరో కమిషన్ పద్ధతిలో ప్రయోజనం పొందేలా ఆటో సేవలను అందించనున్నారు. ఈ యాప్‌ను రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ ఎ. షణ్ముగసుందరం ఆవిష్కరించారు. కుమ్టా స్పెషల్ ఆఫీసర్ ఐ.జయకుమార్, నాస్కామ్ హెడ్ భాస్కర్ వర్మ తదితరులు పాల్గొన్నారు. బెంగళూరు నగరంలో ఆటో సేవలందించి పేరుగడించిన ఈ సంస్థ చెన్నైవాసులకు మెరుగైన ఆటో సేవలను అందించనుందని నిర్వాహకులు తెలిపారు. ఓఎన్‌డీసీ, జస్పే సంయుక్త ఆధ్వర్యంలో రూపొందించిన నమ్మయాత్రీ యాప్‌లో పదివేలమందికి పైగా ఆటో డ్రైవర్లు సభ్యులుగా చేరారని పేర్కొన్నారు.